క్లుప్తంగా

ఓబీసీలో కలపాలని వినతి

గండీడ్: రాష్ట్రంలోని వివిధ కులాలను ఓబీసీలో కలపాలని ప్రధానమంత్రి మోదీకి లింగాయత్ లింగబలిజ రాష్ట్ర అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప వినతి పత్రం అందజేశారు. హైదరాబాద్‌కు వచ్చిన మోదీని ప్రత్యేకంగా కలిసిన ఆయన 32 కులాలను ఓబీసీల్లో కలిపి న్యాయం చేయాలని కోరారు. విషయంపై ప్రధాని సానుకూలంగా స్పందించినట్లు ఆయన వివరించారు.

విశ్వరూప మహాసభ జయప్రదం చేద్దాం



జడ్చర్ల టౌన్: హైదరాబాద్‌లో ఈనెల 11న నిర్వహించే విశ్వరూప మహాసభ జయప్రదం చేద్దామని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ జంగయ్య మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని డిగ్రీ కళాశాల ప్రాంగణంలో విశ్వరూప మహాసభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించి మాట్లాడారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని 30ఏళ్లుగా చేస్తున్న పోరాటం చివరి దశకు చేరుకుందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే మహాసభకు ప్రధాని మోదీ వస్తున్నందున ఉద్యమం సఫలం అయ్యేందుకు మార్గం ఏర్పడినట్లేనన్నారు. అందుకే మాదిగల ఐక్యత చాటాలని, సభకు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఆకాంక్షను ప్రధానికి తెలియజేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్‌మాదిగ, నాయకులు దగ్గుల బాల్‌రాజ్, శివ, భీంరాజ్, గణేస్, సురేష్, చెన్న కేశవులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలంటూ ఈనెల 11న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ ఆధ్వర్యంలో మాదిగల విశ్వరూప మహాసభ నిర్వహిస్తున్నట్లు జిల్లా నాయకుడు బోయపల్లి ఆంజనేయులు తెలిపారు. బుధవారం విశ్వరూప మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు సత్యన్న, మాసయ్య, రాజ్యం, జోడు ఆంజనేయులు, శేఖర్, ఎస్.రాజు, యాదయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆనంద్‌గౌడ్ తొలగింపు హాస్యాస్పదం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గౌడ సంఘం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న ఆనంద్‌గౌడ్‌ను తొలగిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్ పేరున వచ్చిన వార్త అవాస్తవమని తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశం నాగరాజుగౌడ్ తెలిపారు. బుధవారం ఆనంద్‌గౌడ్ నివాసంలో విలేకరులతో సమావేశంలో మాట్లాడారు. లక్ష్మణ్‌గౌడ్‌కు సంఘానికి ఎలాంటి సంబంధం లేదని 5 సంవత్సరాల క్రితమే అతడిని సంఘం నుంచి తొలగించినట్లు వివరించారు. సంఘంలో లేని వ్యక్తి జిల్లా అధ్యక్షుడిని ఎలా తొలగిస్తాడని ప్రశ్నించారు. ఆనంద్ కాంగ్రెస్‌లో చేరినందుకు కక్షపూరితంగా సంబంధం లేని వారితో ప్రకటన ఇప్పించారన్నారు. సంఘంలో అన్ని పార్టీల వారు ఉంటారని గుర్తుంచుకోవాలని అన్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అని ప్రకటించారు. ఆనంద్‌గౌడ్ బీఆర్‌ఎస్‌ను వీడితే చెడ్డవాడిని అవుతానా అని ప్రశ్నించారు.

వాలీబాల్ టీంకు 'పేట' విద్యార్థులు

నారాయణపేట రూరల్: ఆల్ ఇండియా సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ టోర్నమెంట్‌కు పాలమూరు యూనివర్సిటీ టీమ్‌లో పేట విద్యార్థులు స్థానం సంపాదించుకున్నారు. స్థానిక సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్న కే.రాజ్, జే.రాజు పురుషుల, బీజెడ్‌సీ ఫైనల్ ఇయర్‌లో ఉన్న అంజలి స్త్రీల జట్లలో ఆడేందుకు అవకాశం దొరికిందన్నారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ రంగారెడ్డి, ఇన్‌చార్జి పీడీ నారాయణగౌడ్, ట్రైనర్ రాజ్‌కుమార్ క్రీడాకారులను అభినందించారు.

కాకతీయ కట్టడాలకు బీటలు

నర్వ: మండలంలోని ఆయా గ్రామాల్లో ఎన్నో శతాబ్దాల చారిత్రక నేపథ్యం కలిగిన కాకతీయుల కట్టడాలు ప్రస్తుతం బీటలు వారి ఆదరణకు నోచుకోలేక కూలేటట్లున్నాయి. మండల కేంద్రంతోపాటు, పెద్దకడ్మూర్, ఉందేకోడ్ గ్రామాల్లో కోట బురుజులు, ముఖ ద్వారాలు ఉన్నాయి. ప్రస్తుతం కొన్నిగ్రామాల్లో గ్రామస్తులు కొంత మేరకు మరమ్మతులు చేపట్టడంతో పాక్షికంగా ఉన్నాయని ఆయాగ్రామాల ప్రజలంటున్నారు. భావి చరిత్రకు సాక్షిభూతాలైన ఈ కట్టడాలను మరమ్మతు చేపట్టి కాపాడగలిగితే మన ప్రాంత చారిత్రక కట్టడాలు సజీవంగా భవిష్యత్ తరాలకు సాక్ష్యంగా నిలుచుంటాయని వారు కోరుతున్నారు. పురావస్తుశాఖ అధికారులు ఈ కట్టడాలను సందర్శించి తగిన మరమ్మతులు చేపట్టాలని వారంటున్నారు.



సర్వీస్ రోడ్లపై నిర్లక్ష్యమేలా?



శాఖాపూర్ వద్ద సర్వీస్ రోడ్డుపై పాత బీటీని వేసేందుకు చర్యలు



బలీదుపల్లి వద్ద సర్వీస్ రోడ్డు దుస్థితి



అచ్చాయపల్లి వద్ద

అడ్డాకుల: జాతీయ రహదారి సమీపంలోని గ్రామాలు, స్టేజీల వద్ద సర్వీస్ రోడ్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడం లేదు. కొన్ని చోట్ల సర్వీస్ రోడ్లను అసంపూర్తిగా వదిలేయగా మరి కొన్ని చోట్ల సర్వీస్ రోడ్లను ఏర్పాటు చేయలేదు. దీనివల్ల వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అడ్డాకుల మండలంలోని బలీదుపల్లి స్టేజీ వద్ద హైవేపై రోడ్డు క్రాసింగ్‌ను రహదారి నిర్వాహకులు మూసి వేశారు. ఇక్కడ ఉన్న సర్వీస్ రోడ్డును అందుబాటులోకి తేలేదు. దీనివల్ల వాహనాలు బలీదుపల్లి స్టేజీ నుంచి వెల్టూర్ స్టేజీ వరకు రాంగ్ రూట్లో వెళ్తున్నాయి. దీంతో ప్రధాన రహదారిపై వెళ్లే ప్రయాణికులకు ప్రమాదం పొంచి ఉంది.

శాఖాపూర్ వద్ద ఒకవైపే

శాఖాపూర్ వద్ద రహదారి పక్కన పాఠశాల వైపు మాత్రమే సర్వీస్ రోడ్డు ఉంది. ఇక్కడ మరో వైపు సర్వీస్ రోడ్డును పూర్తి చేయలేదు. దీనివల్ల వాహనాలు ప్రధాన రోడ్డుపైనే నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటుండటం ప్రమాదాలకు దారి తీస్తోంది. ఒక వైపు సర్వీస్ రోడ్డు లేకపోవడంతో అండర్ బ్రిడ్జి నిరుపయోగంగా మారింది. ఇదిలా ఉండగా ప్రస్తుతం హైవేపై బీటీ రెన్యూవల్ పనులు జరుగుతుండగా కొన్ని చోట్ల బీటీని కొంత లోపలికి తొలగించి కొత్తగా బీటీ వేస్తున్నారు. తొలగించిన బీటీని శాఖాపూర్ వద్ద అసంపూర్తి సర్వీస్ రోడ్డుపై వేయించేందుకు బుధవారం చర్యలు చేపట్టారు.

అచ్చాయపల్లి వద్ద రోడ్డేది

మూసాపేట మండలం జానంపేట నుంచి అచ్చాయపల్లి స్టేజీ వరకు సర్వీస్ రోడ్డు లేదు. దీనివల్ల గ్రామస్తులు ప్రధాన రహదారిపై రాంగ్‌రూట్లో ప్రయాణిస్తున్నారు. జానంపేట నుంచి అచ్చాయపల్లికి వెళ్లాలంటే మూసాపేట చౌరస్తా వరకు వెళ్లి తిరిగి రావాల్సి వస్తోంది. దీనివల్ల అదనంగా కిలో మీటర్ దూరం తిరిగి రావాల్సి ఉండటంతో వాహనదారులు జానంపేట పాత పెట్రోల్ పంపు నుంచి రాంగ్‌రూట్లో అచ్చాయపల్లి స్టేజీ వరకు వెళ్తున్నారు. కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనదారులు కూడా రాత్రివేళ రాంగ్‌రూట్లో వెళ్తున్నారు. ఇప్పటికైనా రహదారి నిర్వాహకులు రోడ్లపై దృష్టి సారిస్తే వాహనదారులకు సౌకర్యవంతంగా ఉంటుంది.

సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలి

జానంపేట నుంచి అచ్చాయపల్లికి రావడానికి వాహనాలు మూసాపేట వరకు వెళ్లి రావాల్సి వస్తోంది. స్కూల్‌కు నడిచి వెళ్లే పిల్లలకు ఇబ్బంది ఉంది. పాత పెట్రోల్ పంపు ఎదురుగా ఉన్న రోడ్డును అచ్చాయపల్లి వరకు సర్వీస్ రోడ్డుగా మారిస్తే బాగుంటుంది.

–పెద్ద నర్సింహులు, అచ్చాయపల్లి

రోడ్డును బాగు చేయించాలి

బలీదుపల్లి స్టేజీ వద్ద హైవేపై రోడ్డు క్రాసింగ్‌ను మూసి వేశారు. దీనివల్ల రాంగ్‌రూట్లో వెల్టూర్ స్టేజీ వరకు వెళ్తున్నాం. రాత్రివేళ ఇబ్బందిగా ఉంటుంది. బలీదుపల్లి స్టేజీ నుంచి వెల్టూర్ స్టేజీ వరకు సర్వీస్ రోడ్డును బాగు చేయించాలి.

–శ్రీధర్ యాదవ్, బలీదుపల్లి

మరోసారి ఆశీర్వదించండి



అడ్డాకుల: మరోసారి ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. కాటవరం, రాంచంద్రాపూర్, వర్నె, ముత్యాలంపల్లి గ్రామాల్లో బుధవారం ప్రచారం చేశారు. వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రాధిక, ఏండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, సర్పంచులు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగమే



నవాబుపేట: మరిచిపోయి కాంగ్రెస్‌కు ఓటేస్తే బతుకులు ఆగమౌతాయని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం వివిధ గ్రామాల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరిన సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. కేసీఆర్ సీఎంగా మరోసారి ఉండాలన్నారు. మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, జిల్లా నాయకులు నాగిరెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

ఎప్పుడూ లేనంతగా అభివృద్ధి



మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న వివిధ పార్టీల నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీఆర్‌ఎస్ పార్టీలో వంట కార్మిక సంఘం అధ్యక్షుడు నరేందర్ ఆధ్వర్యంలో పలువురు చేరారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో కార్యక్రమం జరిగింది. అనంతరం పట్టణ టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. టీడీ గుట్టకు చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు సైతం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేనంతగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలోనే అభివృద్ధి జరిగినట్లు వివరించారు.

మంత్రికి మద్దతు తెలిపిన నాండ్ల సంఘం...

మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు మహబూబ్‌నగర్ సోమవంశీ ఆర్య క్షత్రియ సమాజ్(నాండ్ల సంఘం) మద్దతు ప్రకటించింది. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకుడు సుభాష్‌రావు ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు మంత్రిని కలిసి మద్దతు ప్రకటించారు. మహబూబ్‌నగర్ అభివృద్ధికి కృషి చేస్తున్న వ్యక్తికి మద్దతుగా ఉంటామన్నారు. అంబాశంకర్, సతీష్, నిరంజన్ పాల్గొన్నారు.

హన్వాడ: కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ కరెంటు కష్టాలు తప్పవని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం హన్వాడ మండల పరిధిలోని టంకర, గుడ్డిమల్కాపూర్, రాంనాయక్‌తండాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన రోడ్‌షోల్లో మంత్రి కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. వారు చెప్పే మాయమాటలు, హామీలను నమ్మవద్దన్నారు. మరోసారి తనను గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా రోడ్‌షోల్లో మంత్రిపై స్థానిక నాయకులు, కార్యకర్తలు పూలవర్షం కురిపించారు. పలు పార్టీల యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. గుడ్డిమల్కాపూర్‌లో గ్రామ కమిటీ అధ్యక్షుడు చిట్టిభీమయ్య ఇంట్లో మంత్రి టీ తాగారు. పార్టీ పరిస్థితిపై సమీక్షించారు. మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, ఎంపీపీ బాల్‌రాజు, జెడ్పీటీసీ విజయనిర్మల, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



గుడ్డిమల్కాపూర్‌లో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

సంక్షేమ పథకాలు కాంగ్రెస్‌తోనే సాధ్యం

సాక్షినెట్‌వర్క్: సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమని ఎమ్మెల్యే అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మచ్చాడ్‌ఖాన్ పల్లితండా, గొల్లబండతండా, తిమ్మసానిపల్లి, కోయనగర్‌లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అయ్యవారిపల్లి, లాల్యానాయక్‌తండా ఉంటున్న 60 కుటుంబాలతో పాటు పలువురు యెన్నం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎన్పీ వెంకటేష్, సిరాజ్‌ఖాద్రీ, మల్లు నర్సింహారెడ్డి, లక్ష్మణ్‌యాదవ్, అజ్మత్ అలీ, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

నీతికి..అవినీతికి పోటీ

సాక్షినెట్‌వర్క్: నీతికి..అవినీతికి మధ్య పోటీ ఎన్నికలని కాంగ్రెస్ అభ్యర్థి జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. చెక్ డ్యామ్‌ల పేరుతో ఇసుకను దోపిడీ చేసిన వారికి ప్రజలు బుద్ధి చెప్తారని అన్నారు. నామినేషన్ వేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. సీఎం సభకు ప్రజలకు స్వచ్ఛందంగా రాలేదన్నారు. నియోజకవర్గ కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. వివిధ గ్రామాల నాయకులు పార్టీల చేరారు. మద్దిగట్లలో 200 మందికి పైగా నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.

కాంగ్రెస్‌లో చేరికలు

గండీడ్: రెడ్డిపల్లికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రఘురాంరెడ్డి, అదేవిధంగా ముదిరాజ్ సంఘం సభ్యులు పరిగి మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవ చేసేందుకే..

కోయిల్‌కొండ: ప్రజాసేవా చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొత్లాబాద్, మల్లాపూర్, సూరారం, బూర్గుపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, సర్పంచ్‌లు కరుణాకర్‌రెడ్డి, కృష్ణవేణి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రచారాన్ని అడ్డుకున్న చౌళ్లతండా సర్పంచ్

భూత్పూర్: మండలంలోని చౌళ్లతండాకు బుధవారం సాయంత్రం మండల అధ్యక్షుడు కేసీ రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిమిత్తం వెళ్లగా బీఆర్‌ఎస్‌కి చెందిన తండా సర్పంచ్ శ్రీను, నాయకులు అడ్డుకున్నారు. తమ తండాకు కాంగ్రెస్ ఏమి చేయలేదని అన్నారు. తండాకు రావద్దని వారితో వాదించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు తండాకు వెళ్లి ఇరుపార్టీలకు చెందిన వారిని నచ్చచెప్పి పంపించారు.

గెలుపే ధ్యేయంగా కృషిచేయాలి



కాంగ్రెస్‌లో చేరిన వారితో అభ్యర్థి అనిరుధ్‌రెడ్డి

నవాబుపేట/బాలానగర్: మండల పరిధిలోని అమ్మపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ అభ్యర్థి అనిరుధ్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనకు ఇక చరమగీతం పాడాలని ప్రజలు నిర్ణయం తీసుకున్నారని నెల రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. జడ్చర్లలో బీఆర్‌ఎస్ నాయకుల ఆగడాలకు ఇక కాలం చెల్లిందన్నారు. ఎంపీటీసీ నర్సింహులు, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి, నర్సింహులు, అంతయ్య, భూపాల్‌రెడ్డి, రాములు ఉన్నారు. మండల పరిధిలోని పెద్దరేవల్లికి చెందిన సాదు వెంకట్ రెడ్డి, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆదిరమణారెడ్డి సమక్షంలో పలువురు ఉమ్మడి గ్రామాల ప్రజలు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా అనిరుధ్‌రెడ్డి గెలుపుకోసం కృషి చేయాలన్నారు. బంద్యాల నాగిరెడ్డి, చిట్టమయ్య, పాండు, హనుమంతు తదితరులు ఉన్నారు.

కాల్వ మరమ్మతు చేపట్టరా..?



నర్వ: మండలంలోని ప్రధాన సాగునీటి వనరులైన భూత్పూరు, సంగంబండ ప్రధాన కాల్వతో పాటు, డిస్ట్రిబ్యూటర్ కాల్వలకు లైనింగ్ చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఆయా గ్రామాలకు సాగునీరందించే ఈ కాల్వలకు కొద్ది వరకు మాత్రమే లైనింగ్ పనులు చేపట్టారని, పిల్ల కాల్వలకు ఎక్కడ లైనింగ్ చేయకపోవడంతో నీరు వృథాగా పోతుందని వారు వాపోతున్నారు. గతంలో చేపట్టిన లైనింగ్ అక్కడక్కడ దెబ్బతినడంతో కాల్వలు తెగిపోయి నీరు వృథాగా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వేసవిలో లైనింగ్ మరమ్మతులు చేపడితే రైతులకు సక్రమంగా సాగునీరందుతుందని అంటున్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారులు దృష్టిసారించి పనులు చేపట్టాలన్నారు.

అర్హులకు పథకాలు అందలేదు



నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి వి. కె సింగ్, అభ్యర్థి మిథున్‌రెడ్డి

పాలమూరు/హన్వాడ: బీజేపీ అభ్యర్థి ఏపీ మిథున్ రెడ్డి నామినేషన్ సందర్భంగా బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. మొదట పట్టణంలోని ఏఆర్ గార్డెన్ నుంచి ర్యాలీ ప్రారంభం కాగా అక్కడి నుంచి రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ ర్యాలీకి కేంద్ర మంత్రి వి.కే సింగ్ హాజరయ్యారు. మిథున్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదని, దళితబంధు ఇవ్వలేదన్నారు. యాదవులకు గొర్రెలు ఇవ్వకుండా తీవ్రంగా మోసం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏపీ జితేందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి పాల్గొన్నారు.

యువత ఆత్మస్థైర్యంతో ముందుకు నడవాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మిథున్‌రెడ్డి అన్నారు. బుధవారం పెద్దర్పల్లి, పల్లెమోనికాలనీకి చెందిన పలువురు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. జిల్లా కార్యవర్గసభ్యుడు కొండాబుచ్చిరెడ్డి, మండల నాయకుడు బాలగోపి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఇంటర్‌స్కూల్ క్రికెట్ టోర్నీ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న లక్ష్మణ్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ఎండీసీఏ మైదానంలో జలజం సత్యనారాయణ ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నీ ఉత్సాహంగా కొనసాగుతుంది. పాఠశాలల జట్లు టోర్నీలో సత్తాచాటుతున్నారు. బుధవారం జరిగిన మ్యాచుల్లో ఎండీసీఏ ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, విద్యావేత్త లక్ష్మణ్‌లు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రికెట్ టోర్నీలో ప్రతిభచాటాలని కోరారు. ఓడినవారు నిరాశచెందకుండా మళ్లీ గెలుపు కోసం శ్రమించాలన్నారు. కార్యక్రమంలో పీఈటీలు వినోద్‌కుమార్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. మూడో రోజు జరిగిన మ్యాచుల్లో క్రిష్ణవేణి స్కూల్ జట్టు 10 వికెట్ల తేడాతో యూనివర్సల్ హైస్కూల్ జట్టుపై, జ్ఞానభారతి స్కూల్ జట్టు 21 పరుగుల తేడాతో మాడ్రన్ హైస్కూల్ జట్టుపై, మాడ్రన్ బేసిక్ స్కూల్ జట్టు 67 పరుగుల తేడాతో కాకతీయ స్కూల్ జట్టుపై, ఫాతిమా విద్యాలయం జట్టు 9 వికెట్ల తేడాతో అపెక్స్ హైస్కూల్ జట్టుపై విజయం సాధించాయి.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



రాజాపూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఏఈఓ శ్రీనివాస్ తదితరులు



కందూర్‌లో ..

రాజాపూర్: మండల కేంద్రంలో బుధవారం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయశాఖ విస్తరణ అధికారి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని తేమ శాతం17కు మించకుండా చూసుకోవాలన్నారు. దీంతో పాటు మట్టిపెల్లలు, తాలు లేకుండా కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. మద్దతు ధర గ్రేడ్ ఏ రకానికి రూ. 2203, సాధారణ రకానికి రూ. 2183గా రైతులుకు చెల్లించనున్నట్లు వివరించారు. అందుకు కోసం ఏఈఓ ధ్రువీకరణ పత్రం, ఆధార్ జిరాక్స్, బ్యాంకుఖాతా కలర్‌జిరాక్స్, బ్యాంకు లింకు ఉన్న రైతు సెల్ నెంబర్, పట్టా పాసుబుక్ జిరాక్స్‌లు కొనుగోలు కేంద్రంలో పీఏసీ ఇన్‌చార్జ్ శేఖర్‌కు అందజేయాలని పేర్కొన్నారు. రాజాపూర్ మండలంలో మొదటి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించామన్నారు. మండలంలోని గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు

అడ్డాకుల: మండలంలోని ఐదు గ్రామాల్లో బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కందూర్, పొన్నకల్, రాచాల, గుడిబండ, పెద్దమునుగల్‌ఛేడ్ గ్రామాల్లో అడ్డాకుల సింగిల్‌విండో ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సీఈఓ వెంకటయ్యగౌడ్, ఏఈఓ ప్రవీణ్ ప్రారంభించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేయించిన కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని సీఈఓ వెంకటయ్యగౌడ్ కోరారు. ధాన్యం విక్రయించే రైతులు తగిన విధంగా తేమ శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.